# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 04-06-2024** **సమయం : 6.45 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. **యావత్ దేశ ప్రజలు ఆసక్తిగా ఎదురు చూస్తున్న లోక్ సభ, ఆంధ్రప్రదేశ్ శాసన సభ ఎన్నికల ఓట్ల లెక్కింపు మరి కొద్ది సేపట్లో ప్రారంభం అవుతుంది.**
2. **ఆంధ్ర ప్రదేశ్ వ్యాప్తంగా 175 శాసన సభ, 25 లోక్ సభ స్థానాలకు 33 చోట్ల ఓట్ల లెక్కింపు ఈ రోజు జరుగుతోంది.**
3. **ఓట్ల లెక్కింపునకు సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయని ఆంధ్రప్రదేశ్ ప్రధాన ఎన్నికల అధికారి ముకేష్ కుమార్ మీనా తెలిపారు.**
4. **తెలంగాణా రాష్ట్రంలో 17 లోక్ సభ స్థానాల ఓట్ల లెక్కింపును 34 ప్రాంతాలలో చేపడతారు.**
5. **తెలంగాణలోని పాలిటెక్నిక్ కాలేజీల్లో ప్రవేశాల కోసం నిర్వహించిన పాలిసెట్ 2024 పరీక్షా ఫలితాలు విద్యాశాఖ విడుదల చేసింది.**
6. **ఋతుపవనాల ప్రభావంతో రానున్న మూడు రోజులు ఉభయ తెలుగు రాష్ట్రాల్లో ఒక మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశముందని భారత వాతావరణ శాఖ తెలిపింది.**

==========================

ప్రపంచంలోనే అతి పెద్ద ప్రజాస్వామ్య వ్యవస్థ కలిగిన భారత దేశంలో 543 మంది సభ్యులు గల లోక్ సభకు ...., ఆంధ్రప్రదేశ్‌తో పాటు వివిధ రాష్ట్రాల శాసన సభలకు జరిగిన ఎన్నికలకు సంబంధిన ఓట్ల లెక్కింపు మరి కొద్ది సేపటిలో ప్రారంభం అవుతుంది. ఓట్ల లెక్కింపు కార్యక్రమం ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు వీలుగా కేంద్ర ఎన్నికల సంఘం దేశ వ్యాప్తంగా విస్తృత స్థాయిలో భద్రతా ఏర్పాట్లు చేసింది. ఈ రోజు ఉదయం 8 గంటల నుండి లెక్కింపు ప్రక్రియ ప్రారంభమవుతోంది. రాజకీయ పార్టీల మధ్య ఎంతో హోరా హోరీగా సాగిన ఈ ఎన్నికల ఫలితాలు ఎప్పటికప్పుడు పొందుపరచే ఓటర్ హెల్ప్ లైన్ యాప్ లో అందుబాటులో ఉంటాయని కేంద్ర ఎన్నికల సంఘం తెలిపింది. ఓటర్ హెల్ప్ లైన్ యాప్‌ను గూగుల్ ప్లే స్టోర్ లేదా యాపిల్ ప్లే స్టోర్ నుండి డౌన్ లోడ్ చేసుకుని ఫలితాలు తెలుసుకోవచ్చు. మరొక వైపు రిటర్నింగ్ అధికారులు, కౌంటింగ్ ఏజెంట్ల కోసం తమ అధికారిక వెబ్ సైట్‌లో వున్న హాండ్ బుక్‌ను కూడా అందుబాటులో ఉంచామని కేంద్ర ఎన్నికల సంఘం పేర్కొంది. కాగా.. అతిపెద్ద ప్రజాస్వామ్య ఎన్నికల ప్రక్రియ ఫలితాల పట్ల యావత్ దేశ ప్రజలలో ఉత్కంఠ నెలకొంది.

-------------------------

ఆంధ్రప్రదేశ్ లో 175 శాసన సభా స్థానాలు, 25 లోక్ సభ స్థానాలలో జరిగిన ఎన్నికల ఓట్ల లెక్కింపునకు సర్వం సిద్ధమైంది. రాష్ట్ర వ్యాప్తంగా 33 చోట్ల 401 కౌంటింగ్ కేంద్రాలలో ఓట్లను లెక్కిస్తారు. ఈ రోజు ఉదయం ఎనిమిది గంటలకు ముందుగా పోస్టల్ బ్యాలెట్‌లు, హోం ఓటింగ్‌కు సంబంధించిన ఓట్లు, సర్వీసు ఓట్లను లెక్కిస్తారు. 8 గంటల 30 నిమిషాల అనంతరం ఈవీఎంలలో నిక్షిప్తమైన ఓట్ల లెక్కింపును చేపడతారు. ఒక వేళ పోస్టల్ బ్యాలెట్, తదితర ఓట్ల లెక్కింపు ఆ సమయంలోగా పూర్తి కాని పక్షంలో వాటి లెక్కింపును కొనసాగిస్తూనే ఈవీఎం ఓట్ల లెక్కింపును చేపడతారు. రాష్ట్ర వ్యాప్తంగా ఓట్ల లెక్కింపు కేంద్రాల వద్ద ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పటిష్టమైన బందో బస్తు ఏర్పాట్లు చేశారు. సి సి కెమెరాల పర్యవేక్షణలో లెక్కింపు కార్యక్రమం జరుగుతుంది.

-------------------------

ఓట్ల లెక్కింపునకు సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయని ఆంధ్రప్రదేశ్ ప్రధాన ఎన్నికల అధికారి ముకేశ్ కుమార్ మీనా తెలిపారు. నిన్న వెలగపూడి సచివాలయంలో నిర్వహించిన పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఈరోజు ఉదయం 8 గంటల నుంచి పోస్టల్ బ్యాలెట్, 8గంటల 30 నిమిషాల నుంచి ఈవీఎం ఓట్ల లెక్కింపు ఉంటుందని తెలిపారు. రాష్ట్రానికి 119 మంది ఎన్నికల పరిశీలకులను ఎన్నికల సంఘం నియమించిందన్నారు. ప్రతి లెక్కింపు కేంద్రంలో కౌంటింగ్ ఏజెంట్లు ఉంటారని, మీడియా రూమ్ ఏర్పాటు చేశామని చెప్పారు. ఎటువంటి హింసాత్మక ఘటనలు జరగకుండా భద్రతా బలగాలను ఏర్పాటు చేశామని, లెక్కింపు కేంద్రాల పరిసరాల్లో 144 సెక్షన్ అమలులో ఉంటుందని తెలిపారు.

-------------------------

తెలంగాణా రాష్ట్రంలోని 17 లోక్ సభ నియోజక వర్గాలతో పాటు, సికింద్రాబాదు కంటోన్మెంట్ శాసన సభా స్థానానికి జరిగిన ఉప ఎన్నిక ఓట్ల లెక్కింపునకు రాష్ట్ర ఎన్నికల సంఘం పటిష్టమైన ఏర్పాట్లు చేసింది. రాష్ట్ర వ్యాప్తంగా 34 ప్రాంతాలలోని 120 హాల్స్ లో ఒక వెయ్యి 855 టేబుల్స్ పై లెక్కింపు జరుగుతుంది. రాష్ట్రంలో 2 లక్షల 18 వేల పోస్టల్ బ్యాలెట్ ల లెక్కింపు కోసం 19 హాల్స్ లో 276 టేబుల్స్‌ను ఏర్పాటు చేశారు. 10 వేల మంది సిబ్బంది ఓట్లను లెక్కిస్తారు. రాష్ట్ర వ్యాప్తంగా 2 వేల 440 మంది సూక్ష్మ పరిశీలకులను నియమించామని, ప్రతి టేబుల్ వద్ద అధికారుల పరిశీలన ఉంటుందని రాష్ట్ర ఎన్నికల సంఘం తెలిపింది.

-------------------------

తెలంగాణలోని పాలిటెక్నిక్ కాలేజీల్లో ప్రవేశాల కోసం నిర్వహించిన పాలిసెట్ 2024 పరీక్షా ఫలితాలు నిన్న విడుదలయ్యాయి. విద్యాశాఖ ముఖ్యకార్యదర్శి బి. వెంకటేశం ఈ ఫలితాలను విడుదల చేశారు. ఫలితాలకోసం విద్యార్థులు పాలిసెట్ వెబ్‌సైట్ ద్వారా ర్యాంక్ కార్డులను డౌన్లోడ్ చేసుకోవచ్చని తెలిపారు. కాగా డిప్లొమా కోర్సుల్లో ప్రవేశానికి మే 24న ఈ పరీక్ష నిర్వహించారు. రాష్ట్రవ్యాప్తంగా 82 వేల 809 మంది విద్యార్థులు హాజరయ్యారు.

-------------------------

ఎన్నికల ఫలితాలు వెల్లడైన తరువాత హైదరాబాదు నగరంలో బహిరంగ ప్రదేశాలు, రహదారులపై ఎవరూ బాణసంచా కాల్చవద్దని హైదరాబాదు నగర పోలీసు కమిషనరేట్ ఒక ప్రకటనలో పేర్కొంది. ఈ ఆంక్షలు ఈ రోజు ఉదయం నుండి రేపు ఉదయం వరకు అమలులో వుంటాయని ..., నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించింది.

---

తెలంగాణ లోక్‌సభ ఎన్నికల ఓట్ల లెక్కింపు సమయంలో కాంగ్రెస్ అభ్యర్థులు పూర్తిస్థాయిలో అప్రమత్తంగా ఉండాలని టీపీసీసీ అధ్యక్షులు, ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి సూచించారు. నిన్న హైదరాబాద్‌లో లోక్‌సభ అభ్యర్థులు, మంత్రులు, కాంగ్రెస్ నాయకులతో ఆయన దృశ్య మాధ్యమం ద్వారా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ, పోస్టల్ బ్యాలెట్ లెక్కింపు పూర్తయ్యాకే ఈవీఎంల కౌంటింగ్ జరుగుతుందని చెప్పారు. ప్రతి రౌండ్ ఓట్ల లెక్కింపు విషయంలో జాగ్రత్తగా ఉండాలన్నారు. ఈ ప్రక్రియపై అభ్యర్థులందరూ అవగాహనతో ఉండాలని రేవంత్ రెడ్డి సూచించారు.

---

ఆంధ్రప్రదేశ్‌లో ఈ రోజు ఓట్ల లెక్కింపు సందర్భంగా కౌంటింగ్ ఏజెంట్లతో తెలుగు దేశం పార్టీ అధినేత నారా చంద్రబాబు నాయుడు అమరావతిలో సమావేశమయ్యారు. నిర్దేశిత సమయానికి ఏజెంట్లు కౌంటింగ్ కేంద్రాలకు చేరుకోవాలని, అన్ని రౌండ్ల లెక్కింపు పూర్తయ్యే వరకు అక్కడే ఉండాలని సూచించారు. ప్రతి ఒక్కరూ నిబంధనల ప్రకారం నడుచుకోవాలని చంద్రబాబు నాయుడు సూచించారు.

---

ఆంధ్ర ప్రదేశ్‌లో రాయలసీమ ప్రాంతంలోకి ప్రవేశించిన నైరుతీ రుతుపవనాలు, దక్షిణ కోస్తాంధ్ర, ఉత్తర తమిళనాడు ప్రాంతాలపై ఆవరించి వున్న ఉపరితల ఆవర్తనం ప్రభావంతో రాష్ట్రంలో పలు చోట్ల వర్షాలు కురుస్తున్నాయి. అనంతపురం, కర్నూలు, వై.ఎస్.ఆర్, అన్నమయ్య తదితర జిల్లాలలో నిన్న కురిసిన వర్షాల ప్రభావంతో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. పలు ప్రాంతాలలో పండ్ల తోటలు దెబ్బతిన్నాయి. కాగా ఈ రోజు పలు జిల్లాలలో ఒక మోస్తరు నుండి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని ఆంధ్ర ప్రదేశ్ విపత్తుల నిర్వహణ సంస్థ ఒక ప్రకటనలో తెలిపింది. శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు, శ్రీ సత్య సాయి, బాపట్ల, పల్నాడు, ప్రకాశం, నెల్లూరు తదితర జిల్లాలలో వర్షాలు పడే అవకాశం ఉందని పేర్కొంది. నైరుతీ రుతుపవనాలు నిన్న తెలంగాణా రాష్ట్రంలో కూడా ప్రవేశించాయి. నాగర్ కర్నూలు, గద్వాల, నల్గొండ జిల్లాల మీదుగా రాష్ట్రంలోకి నైరుతీ ఋతుపవనాలు ప్రవేశించాయని హైదరాబాదు వాతావరణ కేంద్రం తెలిపింది. సాధారణంగా తెలంగాణా రాష్ట్రంలోకి జూన్ రెండవ వారంలో నైరుతీ ఋతుపవనాలు ప్రవేశిస్తాయని, కానీ ఈ సారి రెండు వారాల ముందుగానే రాష్ట్రంలోకి ప్రవేశించాయని అధికారులు వెల్లడించారు. ఈ సారి సాధారణం కంటే అధిక వర్ష పాతం నమోదయ్యే అవకాశం ఉందని హైదరాబాదు వాతావరణ కేంద్రం పేర్కొంది. రుతుపవనాల ప్రభావంతో దక్షిణ ప్రాంత జిల్లాలలో ఈరోజు నుండి మూడు రోజుల పాటు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ కేంద్రం తెలిపింది.

---

ఓట్ల లెక్కింపు సందర్భంగా ఆంధ్ర ప్రదేశ్ వ్యాప్తంగా ఈ రోజు మద్యం దుకాణాలను మూసివేయాలని ఎక్సైజ్ శాఖను రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశించింది. స్థానిక పరిస్థితుల దృష్ట్యా ఈ రోజు, రేపు కూడా మద్యం దుకాణాలను మూసివేయాలని ఆయా జిల్లాల కలెక్టర్లు ఆదేశించారు.

---

ఆంధ్రప్రదేశ్‌లో పోస్టల్ బ్యాలెట్‌ల లెక్కింపు వ్యవహారంలో జోక్యం చేసుకోలేమని సుప్రీం కోర్టు స్పష్టం

చేసింది. ఈ అంశంపై వై.ఎస్.ఆర్. కాంగ్రెస్ పార్టీ దాఖలు చేసిన పిటిషన్‌ను నిన్న తోసిపుచ్చింది. పోస్టల్ బ్యాలెట్ ల ఓటర్ డిక్లరేషన్‌కు సంబంధించిన ఫారం –13పై ధృవీకరణ గెజిటెడ్ అధికారి సంతకం వుంటే సరిపోతుందని , అధికారి పేరు, అధికారిక ముద్ర లేకపోయినా ఆ ఓట్లు చెల్లుతాయని పేర్కొంటూ కేంద్ర ఎన్నికల సంఘం అన్న అంశంలో తాము జోక్యం చేసుకోలేమని సుప్రీం కోర్టు స్పష్టం చేసింది.

---------------------------

అంతర్జాతీయ పీడిత బాలల దినోత్సవాన్ని ఈరోజు జరుపుకుంటున్నాము. ప్రపంచ వ్యాప్తంగా శారీరకంగా, మానసికంగా, భావోద్వేగపరంగా అణిచివేతకు గురవుతున్న బాలల బాధలను గుర్తించే ఉద్దేశ్యంతో ఐక్యరాజ్యసమితి ప్రతి ఏటా జూన్ 4వ తేదీన అంతర్జాతీయ పీడిత బాలల దినోత్సవాన్ని నిర్వహిస్తోంది. బాలల హక్కులను పరిరక్షించే దిశగా ఐక్యరాజ్యసమితి ఈ సందర్భంగా పలు కార్యక్రమాలను నిర్వహిస్తోంది.

======================